## క్లుప్తంగా

### తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా రామ అప్పలనాయుడు



తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా జె.రామ అప్పలనాయుడును నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ సోమవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈయన శ్రీకాకుళం జిల్లా రాజం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై తెనాలి వస్తున్నారు. ఈయన 2017 గ్రూప్–2 ఫలితాల్లో రాష్ట్రంలో రెండోస్థానం సాధించి, ముమ్మిడివరం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నెల్లిమర్లలో కమిషనర్‌గా, శ్రీకాకుళంలో అసిస్టెంట్ కమిషనర్‌గా, పార్వతీపురం, రాజంలలో కమిషనర్‌గా పనిచేశారు. అక్కడి నుంచి బదిలీపై తెనాలి వస్తున్నారు. కొద్దిరోజుల్లో తెనాలిలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

### వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తెనాలిఅర్బన్: స్వశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్లు కొమరబత్తుని జయపాల్, వీర్లపాటి విజయలక్ష్మి, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావులు పిలుపునిచ్చారు. స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గంగానమ్మపేట, సుల్తానాబాద్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు మాట్లాడుతూ మహిళల్లో ఎక్కువగా వచ్చే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఇక్కడు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గంగానమ్మపేట అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ సుభాష్ రమాదేవి మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నందులపేట ఆరోగ్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక, పలు విభాగాల వైద్యులు, పట్టణ మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### కలరా నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు

తెనాలిఅర్బన్: కలరా పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో ఒకటి, గుంటూరులో ఎనిమిది కలరా కేసులు నమోదు అయినట్లు తెలిపారు. కలరా ప్రబలుతున్న నేపథ్యంలో అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విరోచనాలు అయితే వెంటనే వైద్యశాలకు వెళ్లి చూపించుకోవాలన్నారు. ఎవరు ఆర్‌ఎంపీలను ఆశ్రయించవద్దని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణపాయం జరిగే అవకాశం ఉందన్నారు. తెనాలి పట్టణంలోని అన్ని ఆర్వో ప్లాంట్‌లలో శాంపిల్స్‌ను కలెక్ట్ చేయనున్నట్లు చెప్పారు. అలాగే పట్టణంలో కలరాపై ప్రత్యేక సర్వే నిర్వహించనున్నట్లు వివరించారు.

### ఆరోగ్యవంతమైన జీవితానికి మొక్కలు దోహదం


సబ్ కలెక్టర్ సంజనా సింహ



తెనాలిటౌన్: ఆరోగ్యవంతమైన జీవనానికి మొక్కలు దోహదపడతాయని సబ్‌కలెక్టర్ సంజనా సింహా, మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా పీడీ పీపీజీ ప్రసన్న పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మా కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ సంజనా సింహ, పీడీ ప్రసన్న పాల్గొని అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తెనాలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఈరుగుల అన్నపూర్ణ, డివిజన్ పరిధిలోని సీడీపీఓలు పి.విజయగౌరి, విజయలక్ష్మి, ఉమాదేవి, సరిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కె.యామిని, సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి దేవి ఆలయంలో గాయత్రీ దేవిగా..



కాళీమాత దేవాలయంలో శ్రీసంతానలక్ష్మిగా..



రామలింగేశ్వరపేట శివాలయంలో గాయత్రీ దేవిగా..



కోదండరామస్వామి ఆలయంలో గాయత్రీ దేవిగా అమ్మవారు

# గాయత్రీ దేవి నమస్తుభ్యం!



శ్రీవాసవి అమ్మవారికి గాయత్రీ దేవి అలంకారం



వనదుర్గ సంహిత నవచండీ యాగం

- శరన్నవరాత్రుల రెండో రోజు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- దర్శించుకుని పూజలు చేసిన భక్తులు

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన మంగళవారం శ్రీవాసవి అమ్మవారు శ్రీగాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇదే ఆలయంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని శ్రీభవానీదేవిగా అలంకరించారు. అలంకార దాతలు డోగిపర్తి చంద్రశేఖర్–భారతి దంపతులు కాగా, జాలాది వెంకట వీరప్రసాదరావు, విశాలాక్షి డాల్‌మిల్ యాజమాన్యం ప్రసాదం దాతలుగా వ్యవహరించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేకంగా శ్రీవాసవి అమ్మవారికి ప్రీతిగా లోకక్షేమం కోసం నిర్వహిస్తున్న వనదుర్గ (మహావిద్య) యాగ సంహిత నవచండీ యాగంను బ్రహ్మశ్రీ చింతపల్లి శ్రీదత్తశర్మ ఆధ్వర్యంలోఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించారు. సాయంత్రం జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రేడియో, టీవీ ఆర్టిస్ట్ 'కథాగాన సుధ' బెజ్జంగి నాగమణిచే 'వాసవి అమ్మవారి చరిత్ర' బుర్రకథ భక్తులకు ఆకట్టుకుంది. ఆలయ కమిటీ బాధ్యులు, డబుల్‌హార్స్ మినపగుళ్లు అధినేత మునగాల మోహన్‌శ్యాంప్రసాద్ నేతృత్వంలో ఆలయ పెద్దలు పర్యవేక్షించారు.



అమ్మవారి పూజల్లో మాజీ ఎమ్మెల్యే శివకుమార్

**శరన్నవరాత్రి పూజల్లో మాజీ ఎమ్మెల్యే శివకుమార్..**

తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురులో అరవ బాజి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో తొలి రోజైన సోమవారం రాత్రి 8 గంటలకు జరిగిన పూజల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. అమ్మవారి కరుణా కటాక్షాలు తెనాలి నియోజకవర్గ ప్రజలందరిపైనా ఉండాలనీ, రైతులతో సహా అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారన్న ఆకాంక్షను శివకుమార్ వ్యక్తంచేశారు.

**భక్తజన సందడిగా మహోత్సవాలు...**

తెనాలి: పట్టణ దేవీచౌక్‌లోని శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో జరుగుతున్న 94వ శరన్నవరాత్రోత్సవాల్లో రెండోరోజు మంగళవారం అమ్మవారు శ్రీ గాయత్రీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేషసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీలాస్య కూచిపూడి నాట్యాలయం, తెనాలి వారిచే కూచిపూడి, జానపద నృత్యాంశాలను ప్రదర్శించారు. స్థానిక శివాజీచౌక్‌లోని శ్రీకాళీమాత ఆలయంలో అమ్మవారికి శ్రీసంతానలక్ష్మిగా అలంకరించారు. రామలింగేశ్వరపేటలోని గంగాపార్వతి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి శ్రీ గాయత్రి మాత అలంకారం చేశారు. మారీసుపేటలోని శ్రీబాలాత్రిపురసుందరి సమేత శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారు శ్రీకాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మారీసుపేటలోని శ్రీకోదండరామస్వామి వారి దేవస్థానం (రామభక్త అప్పలస్వామి )లో అమ్మవారికి శ్రీగాయత్రి దేవిగా అలంకరించారు. చిన రావూరులోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీగాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి స్వర్ణపుష్పాలతో పూజలు చేశారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) స్వయం పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాల్లో గాయత్రిదేవి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. బెంగళూరుకు చెందిన వాసవి సిస్టర్స్ భక్తికీర్తనలను ఆలపించారు.

### రూరల్ మండలంలో...

తెనాలిటౌన్: దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని నయన మనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా నందివెలుగులోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.



కఠెవరంలో గాయత్రీదేవి అలంకరణలో..

## వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషిచేయాలి

అనుబంధ విభాగాల అధ్యక్షులకు శివకుమార్ దిశానిర్దేశం



అనుబంధ విభాగాల అధ్యక్షులతో శివకుమార్

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన పార్టీ నాయకులు పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషిచేయాలని తెనాలి సమనయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. వైఎస్సార్ సీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన పెదలంక వెంకటేశ్వరరావు, రూరల్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు కమాదుల స్వామి, రూరల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పినపాటి రవికిరణ్, ఉపాధ్యక్షుడు బెజ్జం బాజిలు మంగళవారం స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో శివకుమార్‌ను కలిశారు. తమకు పదవులు కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా శివకుమార్ అన్నారు. రూరల్ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి కొడాలి క్రాంతి, జిల్లా ఉపాధ్యక్షుడు గోల్డ్ రహీమా, నియోజకవర్గ నాయకులు షేక్ దుబాయ్ బాబు, షేక్ పెచింగ్ సుభాని, ఆవుల కోటయ్య, కుర్రా జస్వంత్ యాదవ్, బండ్లమూడి నాని, మల్లెబోయిన రాము, గోడే సుబ్రహ్మణ్యం, సమయపురం సురేష్, కొల్లా గురునాథ్ గుప్తా, అమర్తలూరి సీమోను, అడ్వకేట్ మైలా విజయ్‌నాయుడు, పిల్లి నాగేశ్వరరావు, రుద్రపాటి చెన్నయ్య, కనపర్తి శశికుమార్, ఎర్రగుంట్ల రవీంద్రబాబు, తాడిబోయిన నాగరాజు, షేక్ మీరావలి, కుర్రా శ్రీను, మునిపల్లి వంశీ, మల్లెపాడు రాజ్‌కుమార్, నీలి అజయ్, మన్నవ ప్రభాకర్, అక్కిదాసు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీఎల్‌పీఓ వి.స్వరూప

తెనాలిటౌన్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డివిజనల్ పంచాయతీ అధికారి వి.స్వరూప పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో మంగళవారం స్వస్థ్ నారీ స్వశక్తి అభియాన్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌లో డీఎల్‌పీఓ వి.స్వరూప, ఎన్‌టీఆర్ వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ విజయప్రకాష్, సర్పంచ్ చొప్పర ప్రీతి, కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.సుబ్బారావు, జనసేన నాయకులు తోట నరేంద్ర పాల్గొని పోస్టర్ ఆవిష్కరించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీవో స్వరూప సూచించారు. గుంటూరు నుంచి పలువురు స్పెషలిస్ట్ డాక్టర్లు విచ్చేసి వైద్య శిబిరంలో సేవలందించినట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు పాల్గొని వైద్య సేవలు పొందారు. వీరందరికి అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సీఎస్.వరప్రసాద్, ఇతర వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎల్‌పీఓ, ఇతర అధికారులు

## అంగన్‌వాడీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

తెనాలిటౌన్: డివిజన్ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులకు సంబంధించి అభ్యర్థులకు మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలంయలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కమిటీ వైస్ చైర్మన్ సబ్ కలెక్టర్ సంజనా సింహా, సభ్యులు మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసన్న, డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం డివిజన్‌లోని 53 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. త్వరలో ఫలితాలు విడుదల చేస్తామని వెల్లడించారు. తెనాలి సీడీపీవో పి.విజయగౌరి, ప్రత్తిపాడు సీడీపీవో విజయలక్ష్మి, మంగళగిరి సీడీపీవో సరిత పాల్గొన్నారు.



## పంటకోత ప్రయోగంపై శిక్షణ

తెనాలిటౌన్: పంట కోత ప్రయోగంపై రైతు సేవా కేంద్రాల సహాయకులు అవగాహన కలిగి ఉండాలని సహాయ గణాంక అధికారి పి.వాసుబాబు సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులోని కార్యాలయంలో మంగళవారం మండల పరిధిలోని వ్యవసాయ సహాయకులకు పంటకోత ప్రయోగంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఏడీఏ ఆర్.విజయబాబు, సహాయ గణాంకాధికారి వాసుబాబు, మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు పాల్గొని పంటకోత ప్రయోగంపై అవగాహన కలిపించారు. అదే విధంగా ప్రతి రైతుకు తప్పని సరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటకోత ప్రయోగం వలన రైతులకు చేకూరే లబ్ధిని వివరించారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం



తెనాలిటౌన్: కార్మిక చట్టాన్ని కాలరాస్తూ పారిశ్రామిక వేత్తలకు కొమ్ముకాస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలను సహించేది లేదని సీఐటీయూ నేతలు హెచ్చరించారు. రాష్ట్ర అసెంబ్లీలో కార్మిక చట్టాలకు సవరణ చేస్తూ పెట్టిన బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మారీసుపేటలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తుందని మండిపడ్డారు. ఎనిమిది గంటల పని దినాలను 13 గంటలు చేస్తూ అసెంబ్లీలో చట్టాలు చేయడం కార్మికుల హక్కులను కాలరాయడమేనని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికశాఖ సహాయ కమిషనర్ శివప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలీ, డివిజన్ ప్రెసిడెంట్ కె.రవికుమార్, నాయకులు జి.వెంకటసుబ్బయ్య, సిహెచ్.శేషగిరిరావు, మంగళగిరి వెంకటేశ్వర్లు, రాచూరి వెంకటేశ్వర్లు, సుభాష్ తదితరులు ఉన్నారు.

### ఐటీఐతో మంచి భవిష్యత్తు

తెనాలిఅర్బన్: వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం పేర్కొన్నారు. జగ్గడిగుంటపాలెంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్కిల్ కాన్వొకేషన్ సెర్మని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐ చదివిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. వృత్తిలోని మెలకువలను కూడా తెలుసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జూలైలో నిర్వహించిన ఏఐటీటీ పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అనంతరం వివిధ ట్రేడ్‌ల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. పూర్వ విద్యార్థులు బివి.ప్రసాద్, ఆర్.జనార్ధనరావు, కె.పద్మావతి, పి.రామాంజనేయులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

తెనాలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఇ.అన్నపూర్ణ



మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెనాలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఈరుగుల అన్నపూర్ణ హెచ్చరించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం సలహా సంఘ సమావేశాన్ని మంగళవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి డివిజన్ పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, లేబొరేటరీల్లో లింగ నిర్ధారణపై ఎటువంటి వాణిజ్య ప్రకటలు చేయకూడదని సూచించారు. అలాగే లింగనిర్ధారణ కూడా జరపకూడదన్నారు. లింగ నిర్ధారణ చేస్తే.. వారికి మూడు సంవత్సరాలు జైలు, రూ.50వేలు జరిమానా విధించడంతో పాటు భారత వైద్య మండలి ధ్రువపత్రాన్ని ఐదు సంవత్సరాలు రద్దు చేయడం జరుగుతుందన్నారు. లింగనిర్ధారణ జరపం అనే బోర్డులను కూడా వైద్యశాలల్లో, స్కానింగ్ సెంటర్‌లలో ఏర్పాటు చేయాలన్నారు. సభ్యులు డాక్టర్ నరేంద్రసింగ్, డాక్టర్ కె.సురేష్, డాక్టర్ వినిల్, డాక్టర్ వేముల ప్రియాంక్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ముమ్మనేని భానుమతి, పెనుగొండ వెంకటేశ్వరరావు, నాళం శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం గదుల ప్రారంభం



ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, ఆంధ్రాప్యారిస్ రోటరీ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రామలింగేశ్వరపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నవీకరించిన అంగన్‌వాడీ కేంద్రం స్టోర్‌రూమ్, వంటగదిని మంగళవారం ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన స్టోర్ రూమ్, వంటగది నిర్వహణకు గల ఇబ్బందులను తెలియజేయటంతో రోటరీ సభ్యులు ఇచ్చిన రూ.50 వేల విరాళంతో ఆయా గదులను నవీకరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ విజయగౌరీ, సూపర్‌వైజర్ కొడాలి సౌజన్య సమక్షంలో రోటరీ బాధ్యులు వీటిని ప్రారంభించారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్ పాల్గొన్నారు. రోటరీ క్లబ్ సేవల్లోని ప్రాథమిక విద్య, అక్షరాస్యత కార్యక్రమాల్లో భాగంగా ఈ సేవను చేపట్టినట్టు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ చెప్పారు. సహకరించిన సభ్యులకు క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు. హ్యాపీ స్కూల్స్ డైరెక్టర్ బత్తుల వెంకటేశ్వరరావు డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ అతిథులుగా హాజరయ్యారు.

## లోక కల్యాణ మేళాను సద్వినియోగం చేసుకోండి

మెప్మా పీడీ వి.విజయలక్ష్మి



మాట్లాడుతున్న మెప్మా పీడీ విజయలక్ష్మి

తెనాలిఅర్బన్: లోక కళ్యాణ మేళాను అందరూ ఉపయోగించుకోవాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, మున్సిపల్ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ మొవ్వా యేసుబాబులు పేర్కొన్నారు. మెప్మా విభాగం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం లోక కళ్యాణ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి స్వనిధి 2.0 కింద వీధి విక్రయదారులకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైనవారు వీటిని తీసుకుని సకాలంలో చెల్లించాలని సూచించారు. అనంతరం వీధి విక్రయదారుల కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సమావేశంలో మెప్మా సీఎంఎం విజయ, వివిధ బ్యాంకుల అధికారులు బాలగంగాధర్, కిషన్, కృష్ణప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.నాగమణి, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

## రోడ్డు బ్లాక్.. గో బ్యాక్!



పట్టణ రోడ్లపై పశువుల సంచారానికి అడ్డుకట్ట లేకుండా పోతోంది. విశ్రాంతి కోసం అవి రోడ్లనే బ్లాక్ చేస్తున్నాయి. నాజరుపేటలోని శ్రీమహాలక్ష్మమ్మ చెట్టు వీధిలో చందు పరమయ్య కార్యాలయం వద్ద రద్దీ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం కనిపించిన దృశ్యమిది. ఆవుల మంద అక్కడ తిష్టవేసింది. కేవలం టూ వీలర్లు మాత్రమే వాటి మధ్య దారిచేసుకుని వెళ్లేందుకు అవకాశం ఉంది. అధికారులు కల్పించుకుని గోవులు రోడ్లపై తిరక్కుండా నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. - తెనాలి